క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస : క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ భావం పెరుగుతుందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో జిల్లా ఎస్.పి రాధిక ఆదేశాల మేరకు కాశీబుగ్గ సి.ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడు బిజీగా ఉండే పోలీసులు యువతి యువకుల కోసం ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషదాయకమని అన్నారు. వాలీబాల్ క్రీడల్లో 25 టీములు, బాల్‌బ్యాడ్మింట్ క్రీడల్లో 8 టీములు, క్రికెట్‌లో 6 టీములు పాల్గొన్నాయని కాశీబుగ్గ సి.ఐ శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జెమ్స్, కిమ్స్ ఆసుపత్రుల వైద్యులతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. క్రీడల్లో మొదటి విజేతకు 5వేలు, రెండో విజేతకు 3వేలు, మూడో విజేతకు 2వేల రూపాయలు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి శివరామరెడ్డి, వైద్యులు శరత్, జ్యోత్స్న, రమణారావు, దంత వైద్యుల లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. గురువారం జిల్లా ఎస్.పి రాధిక బొడ్డపాడు గ్రామానికి చేరుకొని క్రీడా పోటీలను పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

బాలుడి ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-కంచిలి: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన లండ యోగేంద్ర అనే ఐదేళ్ల బాబుకి ఆపరేషన్ కోసం తల్లిదండ్రులు చేయూత అందించే వ్యక్తుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సిక్కోలు ఉద్ధానం సేవాసమితి సభ్యులు గురువారం బాలుడి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే బైరిపురం గ్రామానికి చెందిన రేస్ ఫౌండేషన్ నిర్వాహకుడు పుల్లట ప్రవీణ్ స్పందించి తమ ప్రతినిధుల ద్వారా 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాలుడికి మెరుగైన చికిత్స అందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్లోని ఆసుపత్రిని సందర్శించినట్లు తెలిపారు భవిష్యత్తులో బాలుడికి చికిత్స అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామేష్ రెడ్డి, మాదిన ప్రదీప్, పి అనిల్, వేణు, హరి, శరత్ లతోపాటు జి రవి, డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఏఐవైఎఫ్ నాయకులు ఎం. యుగంధర్, కె.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-నరసన్నపేట : ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఏప్రిల్ 5,6 తేదీలలో నరసన్న పేట మండల కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎమ్. యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావులు అన్నారు. జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వారు కోరారు. స్థానిక ఎస్సీ హాస్టల్‌లో శిక్షణ తరగతుల కరపత్రాలను గురువారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూల నుంచి పలువురు యువకులు హాజరవుతారని, ఈ శిక్షణ తరగతులకు ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి. ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి. రాజేంద్ర, ఎస్. లెనిన్ బాబు హాజరవుతారని వారు తెలిపారు. దేశం, రాష్ట్రం లోని రాజకీయ పరిస్థితులను వివరించటం తో పాటు దేశ అభివృద్ధిలో యువత పాత్ర మీద ఉపన్యాసాలతో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున యువత పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

విద్యార్థులకు 4డి స్క్రీనింగ్ పరీక్షలు

విశాలాంధ్ర-జలుమూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు 4డి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పుట్టుకతో వచ్చే లోపాలు, ఆహార లోపాలు, వ్యాధులు, అంగవైకల్యం వంటి నాలుగు అంశాల ఆధారంగా ఈ పరీక్షలు నిర్వహించారు. నిర్ధరణ అయిన విద్యార్థుల వివరాలను వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని సచివాలయ ఏఎన్ఎం స్వప్న తెలిపారు. సిబ్బంది నాగమణి వెంకట్రావు బోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీ కార్యదర్శి సస్పెండ్

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని నగరికటకం గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సస్పెండ్ చేస్తూ కమీషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. కమీషనర్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయని జలుమూరు ఎంపీడీవో జీవీ రవికుమార్ ప్రకటించారు. 2017- 20 మధ్య టెక్కలిలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో అక్కడి బిల్ కలెక్టర్ వసూలు చేసిన నిధులు పక్కదారి పట్టించారని అభియోగంపై ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం లింగుడు పంచాయతీ, ఎం.సున్నా పల్లి గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాల సందర్భంగా, నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొన్న వివిధ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. లింగుడు పంచాయతీ సర్పంచ్ నారాయణరావు, వారి సోదరులు లక్ష్మణరావు, కృష్ణారావుల ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలకు నలు మూలల నుంచి జట్లు పాల్గొన్నాయి. గురువారం నాటికి మూడు రోజులపాటు క్రికెట్ పోటీలు సాగుతుండగా, మరో నాలుగు రోజులు పాటు క్రికెట్ పోటీలు జరిగే అవకాశం ఉందని క్రికెట్ ఆటగాళ్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం జిల్లా కేంద్రం కలెక్టరేట్ వద్ద ఎంఆర్పిఎస్ మహాజన సోష లిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించబడుతుందని, అనంతరం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎస్ఎఫ్ వీహెచ్పీ ఎస్పీస్ పెద్ద ఎత్తున వచ్చి ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని, రానా శ్రీనివాసరావు మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదిగ రాష్ట్ర ఎంఆర్పిఎస్ ఉపాధ్యక్షులు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

సిక్కోలు అమ్మాయికి మరో స్వర్ణం

విశాలాంధ్ర-సోంపేట : మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్ కుమారి వరుస స్వర్ణపతకాలతో దూసుకు పోతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నెల్లూరులో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తృతీయ సీనియర్/జూనియర్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించి నేషనల్‌కు ఎంపిక అయ్యింది. మే నెలలో జరుగుతున్న జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్‌షిప్‌కి ఎంపిక అయినమొదటి సిక్కోలు వీర మహిళగా గుర్తింపు పొందింది. ఈ అమ్మాయి నేషనల్‌లో కూడా మంచి గుర్తింపు సాధించి దేశానికి పేరు తీసుకు రావాలని ఆశిస్తున్నట్లు తన ప్రతిభ పట్ల తండ్రి సూర్యనారాయణ, కోచ్ సురేంద్రరెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీల వివాదం... కేసు నమోదు

విశాలాంధ్ర-టెక్కలి : టిడిపి పార్టీ ఫ్లెక్సీలపై 29వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తుల పోస్టర్లు అంటించడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో టిడిపి నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్కలిలో ఇటీవల స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదినం సందర్భంగా టెక్కలిలో స్థానిక టీడీపీ అభిమానులు అభినందన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని సదరు ఫ్లెక్సీలపైన నిన్న రాత్రి ప్రత్యర్థి పార్టీ కు చెందిన వారు శ్రీరామ నవమి శుభాకాంక్షలు పేరుతో పోస్టర్స్‌ను మా ఫ్లెక్సీలపైన అంటించడం జరిగిందని ఇది కవ్వింపు చర్యగా భావించి మేము సంయమనం పాటించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని పట్టణంలో మీ పోలీస్ స్టేషన్ ముందే ఇటువంటి చర్యలు జరగడం దురదృష్టకరమని కవ్వింపు చర్యలను భగవంతుడైన శ్రీరాముని వాడుకోవడం చాలా నీచమైన సంస్కృతి అని ఇటువంటి సంస్కృతి గతంలో లేదని దీనికి బాధ్యులయన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ జంక్షన్లో మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల అధ్యక్షులు, బగాది శేషగిరి రావు,కోళ్ల లవకుమార్,హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మట్టా పురుషోత్తం,మల్లా బాలకృష్ణ,కోళ్ల వసంత్,బుడంకాయల అభిలాష్, రేయ్యి ప్రీతీష్ చంద్ర, మెండ దమయంతి,బెహరా కాళీ,బసవల అప్పలస్వామి, దల్లి ప్రసాద్ రెడ్డి, పొన్నాడ రాజారావు, ధవల రామచంద్ర రావు, పంగ తవిటయ్య, ఇప్పిలి జగదీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు

విశాలాంధ్ర-టెక్కలి : శ్రీరామ నవమి సందర్భంగా టెక్కలి మండలం సీతాపురం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న సీతారామాంజనేయ స్వామి ఆలయం 13 వ వార్షికోత్సవ మహోత్సవాలలో ఎమ్మెల్సీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం టెక్కలి నియోజకవర్గం వైయస్ఆర్ సిపి పార్టీ కార్యాలయం వద్ద టెక్కలి నియోజకవర్గం లో ఇటీవల కాలంలో భవనకార్మికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కు భవనకార్మికులు తెలియజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని భవనకార్మికులకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీతా పురం ఎంపీటీసీ ప్రతి నిధి బెండి. ఉదయ్ కుమార్, మండల అగ్రికల్చర్ సలహా మండలి చైర్మన్ పిన కాన. వైకుంఠ రావు, రాధవల్లభపురం సర్పంచ్ ప్రతినిధి కొల్లి. అజయ్ కుమార్,కర్మికలు చింతాడ. జీవన్, బడ్డ.రాజేష్,పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో : శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా మలగాం పంచాయతీ కారిపేట గ్రామంలో వేంచేసి ఉన్న సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో ధర్మకర్త ఒక్కళ్ళ ధర్మరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, గురువారం ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో సీతారాముల కళ్యాణం ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే లింగుడు పంచాయతీ, ఎం సున్నపల్లి గ్రామంలో వేంచేసి యున్న సీతారామ స్వామి ఆలయంలో వ్యవస్థాపకులు బైపల్లి రాజన్న వారి కుమారులు మాజీ సర్పంచ్ కీర్తిశేషులు బైపల్లి వెంకటస్వామి కుమారులు, బైపల్లి ప్రకాష్, బైపల్లి మోహన్ రావు, బైపల్లి రామారావు, బైపల్లి భాస్కరరావు దంపతులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సీతారాముల కళ్యాణం ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పురోహితులు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని కళ్యాణ ఉత్సవాలను తిలకించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, యువకులు పాల్గొన్నారు. అలాగే మండలంలో సీతానగరం, బోరుభద్ర, సంతబొమ్మాళి, సురాడవాని పేట, అంట్లువరం తదితర గ్రామాల్లో శ్రీరామన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎవరికి వారే యమునా తీరే..!

- జిల్లా వైసీపీలో కనిపించని హుషారు
- ఇప్పటికీ ఎంపీ అభ్యర్థిపై లేని స్పష్టత
- జిల్లా కార్యాలయాన్ని పెద్దగా పట్టించుకోని నాయకులు



విశాలాంధ్ర-శ్రీకాకుళం : అధికార పార్టీ కార్యాలయం అంటే ఎలా ఉండాలి నిత్యం కార్యకర్తలు, నాయకులతో కళకల లాడాలి. కానీ వైసీపీ జిల్లా కార్యాలయం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టౌన్ హాల్ వద్ద కార్యాలయం ఉన్నప్పుడు నిత్యం హడావిడి కనిపించేది. అధికారం వచ్చాక కార్యాలయం చంద్రమహల్ ఎదురుగా మార్చారు. వాస్తు దోషమో లేకా అధికారం ఉంది కదా అని దీమానో తెలియదు కానీ జిల్లా కార్యాలయాన్ని పెద్దగా పట్టించుకున్న పాపాన పోవటం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు అంటున్నారు. కొత్తలో కొంత కళకల లాడిన కార్యాలయం ఇప్పుడు కల తప్పిందనే చెప్పాలి. సమస్యల పరిష్కారం కోసం జిల్లా కార్యాలయం కి వచ్చిన కార్యకర్తకు భరోసా దొరకటం లేదని అంటున్నారు. ప్రతిపక్షం లో ఉన్నప్పుడు జిల్లా కార్యాలయం వద్ద ఇద్దరు ముగ్గురు నాయకుల కార్యాలయాలు ఉండేవి అధికారం వచ్చాక కార్యాలయం మర్చాక జిల్లా అధ్యక్షులు కూడా పెద్దగా కార్యాలయంలో అందుబాటులో ఉండని పరిస్థితి ఉందంటున్నారు. నియోజక వర్గ స్థాయిలో గానీ, మండల స్థాయి లో గానీ పార్టీ లో ఏదైనా సమస్య ఉంటే ఆ సమస్య చెప్పుకునేందుకు వచ్చే కార్యకర్తకు ఇక్కడ వినే నాదుడే కరువయ్యారని వాపోతున్నారు. ప్రతి పక్షం లో ఉన్నప్పుడు కార్యాలయం కి ఎవరు వచ్చినా కనీస మర్యాద ఉండేదని ఇప్పుడు అది ఏ మాత్రం కనిపించటం లేదంటున్నారు. సమస్యలు ఉంటే ఏదో హెడ్ ఆఫీస్ నియమించిన సిబ్బంది కి చెప్పుకున్న నాయకుల సమన్వయ లోపం తో సమస్యల పరిష్కారం కాక లాభం లేని పరిస్థితి వలన కార్యాలయం ఎప్పుడు చూసినా వెలవెల పోతూ కనిపిస్తుందంటున్నారు. గత ఎన్నికల్లో జిల్లా లో ఎక్కువ స్థానాలు సాధించినా అధికారం వచ్చాక పదవులు అనుభవిస్తున్న వారు పార్టీ పటిష్టత కు పెద్దగా పనిచేయటం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు అంటున్నారు. ఆ మధ్య ఐ ప్యాక్ వారు జిల్లా లోని నాయకులు జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లు పెట్టేలా చూస్తున్నారు. పార్టీ పదవులు దక్కితే అలాంటి వారు తన నాయకునీ వద్ద సంబరాలు చేస్తున్నారే తప్ప జిల్లా కార్యాలయం వద్ద పార్టీ కార్యక్రమంగా ఎటువంటి కార్యక్రమాలు చెయ్యటం లేదని, మొత్తానికి జిల్లా కార్యాలయం ఒకటి ఉందని కూడా మరచిపోయే పరిస్థితి దాపురించినా అశ్చర్యం లేదంటున్నారు. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీ కి పట్టభద్రుల పట్టం కట్టారు. దీనికి ప్రధాన కారణం కూడా ఈ ఎన్నికల్లో వైసీపీ పోల్ మేనేజ్ మెంట్ లో పూర్తి గా విఫలం అయ్యిందంటున్నారు. టీడీపీ నాయకులు కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రతీ పట్ట భద్రుని నీ కలిశారని వైసీపీ మాత్రం ఆ పని చెయ్యలేక పోవటం కూడా ఓటమికి ఒక కారణం అని కార్యకర్తలు అంటున్నారు. ఏ నాయకుడు కూడా పార్టీ నీ పటిష్టం చెయ్యడానికి ముందుకు రావడం లేదని ఏదో నడుస్తోంది నడవని అందరికీ ఏది జరిగితే నాకు అదే జరుగుతుందనే భావనతో ఉన్నారని కార్యకర్తలు చర్చించి కుంటున్నారు. మరో ఏడాది లో ఎన్నికలు జరగవచ్చు ఇప్పటి వరకూ జిల్లా వైసీపీ ఎంపీ అభ్యర్థి ఎవరు అనేది కూడా స్పష్టత రాకపోవటం ఎమిటనీ ప్రశ్నిస్తున్నారు. ఇది జిల్లా నాయకుల సమన్వయం కి ఉదాహరణ గా చెప్పుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో ఎంపీ పరిధిలో 7 నియోజక వర్గాల్లో 5 ఎమ్మెల్యే స్థానాలు గెలిచినా జగన్ మ్యానియా రాష్ట్రం మొత్తం పనిచేసినా జిల్లా ఎంపీ స్థానం మాత్రం టీడీపీ ఎగరేసుకు పోయింది. దీనికి ముఖ్య కారణం ఎంపీ రామమోహన్ నాయుడు కు యువత లో, ప్రజల్లో మంచి ఫాలోయింగ్ ఉండటం ఒక కారణం అయితే జిల్లా వైసీపీ నాయకుల్లో సమన్వయ లోపం కొంపముంచిందంటున్నారు. ఇప్పటికీ వైసీపీ ఎంపీ అభ్యర్థి ఎవరో తేల్చకుండా ఉంటే ఈ సారి కూడా ఆ స్థానం వైసీపీ కోల్పోవటం ఖాయమంటున్నారు. ఇప్పుడు ముందస్తు ఎన్నికలు అని అంటున్నారు అదే జరిగితే ఎప్పటికప్పుడు అభ్యర్థి నీ ప్రకటిస్తే ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గతం లో కన్నా ఎక్కువ మెజార్టీ తో గెలుస్తారని వైసీపీ కార్యకర్తలే చెప్పుకుంటున్నారు. ఎంపీ అభ్యర్థి ఎవరో ప్రకటించుకునే స్థితి లో జిల్లా వైసీపీ నాయకులు లేకపోవటం దారుణమని, జిల్లా నాయకులు చెప్పిన పేర్లు అధిష్టానం పరిశీలించటం లేదో లేకా జిల్లా నాయకుల మీద జగన్ కు నమ్మకం లేక వీరు చెబుతున్న వారిని ఎంపీ అభ్యర్థి గా నిర్ణయించ లేక పోతున్నారో అర్థం కావటం లేదు కానీ ఎంపీ అభ్యర్థి ఎవరో ప్రకటిస్తే ఆ అభ్యర్థి అయిన తన గెలుపు కోసం జిల్లా నాయకులను సమన్వయం చేసి పార్టీ నీ గాడిలో పెట్టే అవకాశం ఉంటుందని, లేదా అధిష్టానం అయినా సరైన నాయకునికి జిల్లా పగ్గాలు అప్పగించి ఎటువంటి మొహమాటాలు లేకుండా పార్టీ బలోపేతం కి కీలక నిర్ణయాలు తీసుకునే వారికి జిల్లా పగ్గాలు ఇచ్చయినా పార్టీని గాడిలో పెట్టాలని లేకుంటే వచ్చే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైసీపీ అభిమానులు అంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బొరివంక సబ్ స్టేషన్ పరిధిలో మణిక్యపురం ఫీడర్,11కేవీ అర్ డబ్ల్యూ ఎస్ ఫీడర్స్ లో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతున్నట్లు టెక్కలి ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఏ రాజశేఖర్ ,కవిటి ఎలక్ట్రికల్ ఇంజనీర్ నేతాజీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.బొరివంక సబ్ స్టేషన్ పరిధిలో గల మాణిక్యపురం, బల్లి పుట్టుగ,బెజ్జి పుట్టుగ,బోరివంక,బిజీ పుట్టుగ తదితర గ్రామాలకు మణిక్యపురం ఫీడర్, 11కేవీ అర్ డబ్ల్యూ ఎస్ ఫీడర్స్ లో గల గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.లెవెన్ కె.వి విద్యుత్ లైన్ కు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించే నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్జీదారులకు న్యాయం జరిగేనా..!

- అక్రమిత భూములకు మోక్షం కలిగేనా..!
- స్పందనపై ఉత్కంఠంగా ఎదురుచూస్తున్న ప్రజలు

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గంలో 2019 నుంచి జరిగిన ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ప్రైవేటు వ్యక్తుల భూ కబ్జాలపై రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఉక్కుపాదం మోపారు. దీనిలో భాగంగా బుధవారం పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవిన్ అధ్యక్షతన భూ సమస్యలపై నిర్వహించిన ప్రజాదర్బార్ (స్పందన) కార్యక్రమంలో వందలాది మంది పాల్గొని తమ భూములు, ఇళ్ల స్థలాలు కబ్జాలకు గురయ్యాయని 134 ఫిర్యాదులను అందజేశారు. అయితే ఆర్జీదారులకు న్యాయం, అక్రమిత భూములకు మోక్షం జరుగుతుందో లేదో గాని న్యాయం కోసం స్పందన కార్యక్రమంపై ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అయితే ఇక్కడే ఒక ట్విస్ట్ ఉంది. పలాస నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడే సమయంలో మొదటి ఎమ్మెల్యేగా దివంగత నేత జుత్తు జగన్నాయకులు ఎన్నికయ్యారు. ఆయన పరిపాలనలో భూ కబ్జాలపై ఎటువంటి ఆరోపణలు రాలేదని సమాచారం. రెండో అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ ఎన్నిక కావడంతో అంత వరకు స్థబ్దతగా ఉన్న పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కన్నులు భూ కబ్జాలపై పడింది. కొంత మంది మాత్రమే భూ కబ్జాలు చేస్తూ ఎమ్మెల్యే శివాజీని మభ్యపరుస్తూ తమ వ్యవహారాలను కొనసాగిస్తూ వచ్చారు. ఇలోగా మూడో అసెంబ్లీ ఎన్నికలు దాపురించడం మాజీ ఎమ్మెల్యే శివాజీ కుమార్తె శిరీషాపై వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సీదిరి అప్పలరాజు పోటీ చేసి విజయం సాధించారు. ఎన్నికలకు నెల రోజులు ముందే శివాజీ అనుసరించిన కొంత మంది ద్వితీయ శ్రేణి నాయకులు వైసీపీ పార్టీలో చేరిపోవడం జరిగి పోయింది. తెలుగుదేశం పార్టీలో ఉండేటప్పుడు కబ్జాల్లో అరి తేరిన వారే వైసీపీలో ఉండడం గతంలో చేతివాటంకు అలవాటు పడిన వారే ప్రస్తుత వైసీపీ పాలనలో కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఏ మూహుర్తన ఏ మహానుభావుడో " అ నలుగురు" అని పేర్కొన్నారో వారి పైనే సమావేశంలో మంత్రి డాక్టర్ సీదిరి కేంద్రీకరించారు. తన వెనుక తిరుగుతున్న చోటా నాయకులు చేసే కబ్జాలను వదిలి ఆ నలుగురు సెంటు భూమి కూడా కబ్జా చేయలేదని, ఒక వేళ వారు చేసి ఉంటే తనపైనే మచ్చ పడుతుంది కదా అని ఆవేశంగా మీడియా సమావేశంలో వ్యక్తం చేశారు. ఇంకా ఒక అడుగు ముందుకేసి ఎవరైనా నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సమావేశంలో ప్రకటించారు. అయితే ఆ నలుగురు భూ కబ్జాలు ఎప్పుడు చేయలేదని, వివాదస్పద భూముల పరిష్కారంలో మరి కొన్ని కఠినమైన వ్యవహారాల్లో రాజీలు కుదర్చడంలో వీరి హస్తం ఉందని ప్రచారం జరుగుతోంది. పోగ లేకుండా నిప్పు రాదనే నానుడి ఇక్కడ సరిపోతుంది. కట్ చేస్తే తెలుగుదేశం పార్టీలో గల కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వైసీపీలో గల మరి కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేతులు కలిపి కోట్లాది రూపాయల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఆ పార్టీలో గల నాయకులకు ఆపద వస్తే టీడీపీ మద్దతు దారుడు వారి వ్యవహారాలు చక్కబెడతారని, టీడీపీ నాయకులకు అపద వస్తే వారి వ్యవహారాలను అధినాయకుడుకి చెప్పి సమస్యను పరిష్కరించే పరిస్థితులు దాపురిస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏ పార్టీలో ఉంటే మనకేమిటీ మన కబ్జాలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుందని సంతోషంగా టీడీపీ, వైసీపీ నాయకులు బాహాబాహిగా పేర్కొనడం వింత గొల్పుతోంది. ఇంత జరిగినా అధికారుల్లో చలనం కరువైంది. గతంలో స్థానిక విలేకరులు సాక్ష్యాదారాలతో కబ్జా వార్తలు ప్రచరిస్తే వాటిపై అప్పుడే చర్యలు తీసుకొని ఉంటే అ ప్రాంతంలో పక్కా భవనాలు నిర్మాణాలు జరిగేవి కావు. అలా ఉదాశీనంగా స్థానిక తహాశీల్దార్ వ్యవహరించడంతో గోరుతో పోయేది గొడ్డలి వరకు వచ్చిందని కొంత మంది సీనియర్ వైసీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో గుండెకాయ వంటి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో కబ్జాల ఆరోపణలు రావడం ఇరు పార్టీలకు మంచిది కాదని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు ఎన్నికలు జరుగుతాయనే సంకేతాలు వస్తున్న తరుణంలో ఏప్రిల్‌లో గాని, మేలో గాని రాష్ట్ర అసెంబ్లీని రద్దు చేసే పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ అసెంబ్లీ రద్దు అయితే నవంబరులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇరు పార్టీలకు చెందిన అధినాయకులు తమ ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టిసారించి పార్టీ మనుగడ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది. ఎవరు దొంగ.. ఎవరు దొర నియోజకవర్గ ప్రజలకు తెలుసునని, ఎన్నికల్లో బ్యాలెట్‌తో వారి ప్రతాపం చూపిస్తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

జానకీరాముడు జగతికి ఆరాధ్యుడు

టీడీపీ యువ నాయకులు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : సకల సుగాణాల జానకీరాముడు జగతికి ఆరాధ్యుడని టీడీపీ యువనాయకులు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బొందిలీపురం బాయమ్మతోటలో వెలసిన శ్రీ వీరాంజనేయ రామమందిరంలో గురువారం శ్రీరామనవమి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరామ జయగాథ భారతీయ గౌరవాన్ని, జ్ఞాన వైరాగ్యాలు, సదాచారం, నీతి నియమాలు, ధర్మం, సోదరప్రేమ, మిత్రత్వము మొదలగు అనేక అంశములతో ముడివడి ఉందన్నారు. రామకథలో రామచంద్ర ప్రభువు త్యాగనిరతి, ధర్మపాలన, పితృవాక్యపాలన, సత్యవాక్యపాలన ప్రజలను కన్నబిడ్డలవలె చూచి ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి ప్రజానురంజకంగా పాలించిన తీరు ఇమిడి ఉన్నాయని వివరించారు. రామకథతో విభిన్న పరిస్థితులలో సమాజంలో ప్రవర్తించవలసిన అనేక అంశాలపై అవగాహన కలుగుతుందని చెప్పారు. రామకథలో ప్రతిజ్ఞాపాలన, మహోన్నతమైన రాజధర్మం, ఆదర్శ జీవనంతోపాటు సామాజిక, నైతిక, ధార్మిక విషయాలు, పుత్ర వాత్సల్యం, గురుశిష్యుల సంబంధాలు, భార్యాభర్తల ప్రేమానురాగాలు నియమాలు పొందుపరచారని తెలిపారు. అంతేకాకుండా గుహుని ప్రేమానురాగం, సేవానిరతి, భరతుని నిరుపమానమైన సోదర వాత్సల్యం, ఆత్మీయత, అనురాగం, సుగ్రీవుని స్నేహశీలత, హనుమ సాటిలేని స్వామిభక్తి, రాక్షస జాతి యందు జన్మించినా విభీషణుడి అసాధారణ ధర్మతత్త్వము, న్యాయదృష్టి, లక్ష్మణుడి సోదర భావం, సీతాదేవి ఆదర్శ పాతివ్రత్యం, ఏ వివాదమునైనా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని హితవు పలుకుతోందని వివరించారు. అంగద రాయబారములోని విజ్ఞత మనకు మార్గదర్శకాలు అని అందుకే రాముడన్నా రామగాథను తెలిపే రామాయణమన్నా హిందువులకు అత్యంత ప్రేమ, పవిత్రమైందని గొండు శంకర్ అభిప్రాయపడ్డారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రదాస్, టీఎన్ ఎస్ ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి శంకర్, రాయి కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-పాతపట్నం: మండలం కేంద్రంలో శ్రీ రామ నవమి సందర్భంగా మండలంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీరామ కళ్యాణ మహోత్సవంలో స్థానిక పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి వైసిపి కార్యకర్తలు నాయకులతో కలసి పాల్గొన్నారు.

నందిగాంలో : మండలం కోటిపల్లి గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక

పూజలు గ్రామస్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టి శ్రీరాముని కల్యాణ వైభోగం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, సంభాన దానయ్య, బోరుభద్ర సోమేశ్వరరావు, తడేల చిరంజీవి తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు దేవుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు యూత్ చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

మెళియాపుట్టిలో : మండలంలోని పెద్ద పద్మాపురం కోసమాల తదితర పలు గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం నాడు శ్రీరామనవమి సందర్భంగా మెళియాపుట్టి మండలంలో కొసమాల,ఇటు పెద్ద పద్మపురం గ్రామాల్లో

రామాలయలలో సీతారాములను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తుల సమక్షంలో సీతారాములకు కళ్యాణం జరిపారు. అనంతరం అన్నదాన సంతర్పణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఆర్ ఆధ్వర్యంలో...

పాతపట్నంలో : నియోజకవర్గం పాతపట్నం మండలం తామర గ్రామంలో శ్రీ కోదండ రామాలయం వద్ద తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణం చలువ పందిళ్ల నీడన ప్రజలు రాముని కళ్యాణాన్ని తిలకించారు. తామర గ్రామంలో 21 మంది దంపతులు పెండ్లి పీటలపై కూర్చొని

సీతారాముల కళ్యాణాన్ని జరిపించారు. అనంతరం సుమారుగా 8 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ సమాజంలో మానవులు ఏ విధంగా జీవించాలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించినా, రామ గాథ విన్న, శ్రీమద్రామాయణం చదివిన రాజనీతజ్ఞత తెలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులతో పాటు, చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు, గ్రామస్తులు, ఎంజీఆర్ అభిమానులు, మీడియా మిత్రులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో : మండలం నువ్వలరేవు గ్రామంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వారం రోజులు పాటు సాగే కార్యక్రమాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శిస్తారు. ఈ వేడుకులు తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు ఒడిస్సా నుంచి కూడా ప్రజలు వస్తారు. ఒడియా కేవిటి కులానికి చెందిన నువ్వలరేవు గ్రామస్తులు శ్రీరామనవమి పండగను మాత్రం తమ సొంత పండగగా గ్రామంలో గల ప్రజలు సంబరాలతో

జరుపుకుంటారు.

ఎచ్చెర్లలో : సాయుధ పోలీస్ క్వార్టర్స్‌లోని కోదండ

రామాలయంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగ జరిగింది. ఈ కళ్యాణంలో ఎస్పీ జి.ఆర్ రాధికా దంపతులు పాల్గొన్నారు. ఎప్పుడూ విధులతో బిజీబిజీగా కనిపించే సాయుధ సిబ్బంది సంప్రదాయ దుస్తులతో కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర రావు డిఎస్పీలు ఎస్ బాలరాజు డి.ప్రసాదరావు ఆర్ఐలు ప్రదీప్ ఉమామహేశ్వర రావు పోలీసు కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఎస్ఎం పురం కోదండ రామాలయంలో సీతారామ కళ్యాణాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి జడ్పీ మాజీ చైర్పర్సన్ చౌదరి ధనలక్ష్మి బిజెపి మండల అధ్యక్షుడు సంపద రావు నాగేశ్వరరావు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కింతని ఈశ్వరరావు మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్ల లోని రామ్ నగర్‌లో సీతారాముల కళ్యాణం అనంతరం అన్న ప్రసాద దానం నిర్వహించారు.

ఆకట్టుకున్న చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు

శ్రీరామ నవమి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన సీతారామ కల్యాణంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఎగ్జామినేషన్స్ డీన్ ఉదయ్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ టీవీ రమణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జరుగుళ్ల శంకరరావు, వేద పండితులు సంతోష్ శర్మ, ప్రొఫెసర్లు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో చిన్నారులు క్షీరజ్, అంకిత, అలేఖ్య, దిలీప్, కీర్తి, కావ్య, సుశ్మిత, దీక్షిత, తల్లిదండ్రులు, భక్తులు, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటిలో : మండలంలోని ప్రగడపుట్టుగ, కవిటి, కె. కొత్తూరు, జగతి, డొంకపుట్టుగ, బొరివంక, ఇసుకలపాలెం, రామయ్యపట్నం తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే

బెందాళం అశోక్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కమిటీ వారు ఉద్దానం కళాకారులుచే నామ సంకీర్తన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డొంకపుట్టగ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులకు అలాగే మండల ఎంపీపీ ప్రతినిది కడియాల ప్రకాష్, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణ రావులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారుసన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో : మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు

పురస్కరించుకుని రామాలయాల్లో వేకువ జామున నుండి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా సీతారాముల పూజలు నిర్వహించారు. లైధామ్ ధర్మక్షేత్రంలో వైభవంగా యోగాలు నిర్వహించారు. స్థానిక సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో సాయి మందిరంలో సీతారాముల పూజల నిర్వహించిభక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందించారు.లోలుగులో భక్తిశ్రద్ధలతో ప్రజల పూజలు చేశారు. బురిడీ కంచ రాము, లక్ష్యం పేట, తానేం, దల్లి బాబిరీజిపేట, గునానపేట, మల్కాం, తండ్యం గ్రామాలలో సీతారామస్వాముల వారి పూజలు ఘనంగా నిర్వహించారు. లోలుగు జడ్పీటీసి ఆధ్వర్యంలో రామ మందిరం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, గునాన్నపేట గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ గుణాన కృష్ణ ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. శ్రీరామనవమి ఉత్సవాలు సందర్భంగా వాడ వాడల్లో ఎక్కడ చూసినా రామ నామ స్మరణలతో మార్మోగాయి. భక్తులు స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇచ్ఛాపురంలో : గురువారం పట్టణం, మండలంలో వివిధ

రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తుల్లో ఇళ్ళలో పూజాధికాలు నిర్వహించుకుని దేవాలయాల వద్ద బారులు తీరారు. స్థానిక మెయిన్‌రోడ్డు పై గల కోదండ రామాలయంలో స్వామి వారికి ఉదయం నుంచి అర్చకులు ఎస్.గోపాల క్రిష్ణ, పద్మనాభాచార్యులు ఆధ్వర్యంలో వివధ రకాల సేవలు పూజలు జరిపి, రాంప్రసాద్ సిద్దాంతి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దాసన్నపేట రామాలయాన్ని భక్తులు సందర్శించారు. పంజావీధి రామ మందిరంలో నర్సింహమూర్తి ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీరామ నవమి, సీతారాముల కళ్యాణ వేడుకలను నిర్వహించారు.

రోడ్డును తవ్వేస్తున్నారు..!

- గోతులు మయమైన ప్రధాన రహదారి
- మరమ్మతుల పేరిట నిత్యం ఇదే దుస్థితి

విశాలాంధ్ర-ఆమదాలవలస : నిత్యం ప్రయాణికులకు రద్దీగా ఉండే పట్టణ ప్రధాన రహదారి మరమ్మతుల పేరిట గోతు లు తవ్వి విడిచిపెడు తున్నారు. దీంతో ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందు లు ఎదురవుతున్నాయి. ఎక్కడకక్కడ రోడ్డుని తవ్వేయడంతో వాహనాలు రాక పోకలకు ఇబ్బందులు ఎదురవు తు న్నాయి. కొత్త విద్యుత్ స్తంభాలు వేయటానికి కొన్ని చోట్ల గోతులు తవ్వి నెలలు గడుస్తున్న వాటిని పూర్తి చేయకపోవడంతో ప్రయాణి కులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా నిత్యం తాగునీటి సమస్య ఎదురవుతున్నప్పుడు రోడ్డు మధ్యలో ఉన్న వాలువులను మరమ్మత్ చేసేందుకు రోడ్డును తవ్వేసి విడిచి పెడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు తవ్వేయడంతో ప్రమాదాలు జరిగి ఆసుపత్రి పాలౌ తున్నారు. తాగునీటి సరఫరాకు ఎప్పటికప్పుడు అంత రాయం కలుగుతుంది. పట్టణ పెద్దలు కొంద రు మోటార్లు తాగునీటి కుళాయిలకు ఏర్పా టు చేయటంతో ఎప్పటికప్పుడు వాల్వు మరమ్మతులకు గురవుతుంది. దీంతో సిబ్బంది వాటిని తవ్వే సరికి సమయం మించి పోవటంతో విడిచిపెట్టి, మడిశెట్టి రోజు వాటిని తిరిగి పరిశీలిస్తున్నారు దీంతో రహదారిపై ప్రయాణించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాగునీటి పైపులైనుకు మోటార్లు బిగించిన వారి సంఖ్య పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయంలో ఉన్నప్పటికీ వాటిని తొలగించే సాహసం అధికారులు చేయలేకపోతున్నారు. నాయకుల మౌఖిక ఆదేశాలతో వాటి వద్దకు వెళ్లేందుకు కూడా సాహసం చేయలేదు అనే విమర్శలు ఉన్నాయి. పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్ట రాజ్యాంగ వ్యవహరి స్తున్నారు. ప్రత్యేక అధికారైన ఆర్డీవో కూడా ఈ రెండేళ్లలో ఒక్కసారి కూడా పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో అభివృద్ధి మాట అటు వంచినా ఉన్నవి కూడా తవ్వేస్తూ గోతులమయం చేయటంతో పట్టణ ప్రజలు రుసురుసు లాడు తున్నారు. రాజ్యాంగ శక్తులు పట్టణంలో పాలన సాగిస్తుండటం తో ఇటువంటి దుస్థితి ఏర్పడుతుంది. ఏది ఏమైనప్పటికీ తక్షణమే ఇటువంటి పరిస్థితుల్లోను సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయవలసిన అవసరం పురపాలక సంఘ అధికారులపై ఉంది.

ఉత్సవాలకు సిద్ధమవుతున్న నూకాలమ్మ తల్లి ఆలయం

విశాలాంధ్ర-పోలాకి : వచ్చే నెలలో ప్రారంభం కానున్న భువనేశ్వరి దేవి సిరిమానోత్సవాలకు నూకాలమ్మ తల్లి ఆలయం నిర్మాణ పనులతో సిద్ధమవుతుంది. మండలంలో గల ప్రియాగ్రహారంలో భారీ ఏర్పాట్లతో సిరిమానోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో వెలిసిన నూకాలమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ట చేస్తూ ఆలయం నిర్మాణం పనులు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే గ్రామస్తులు నిత్య పూజలు చేస్తూన్నారని నిర్మాణ పనులు తానే స్వయంగా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో శాశ్వత పనులైన స్మశానంలో మంచినీటి భావి నిర్మాణం ప్రస్తుతం నిర్మాణం చేస్తున్న నూకాలమ్మ తల్లి ఆలయం పనులు చేపట్టిన మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావును, మాజీ ఎమ్మెల్యే కన్నేపల్లి అప్పల నరసింహ భక్త, గ్రామ సర్పంచ్ బెవర నూకరాజు, మాజీ సర్పంచ్ మద్దు అప్పయ్య, ఎన్ని సూర్యనారాయణ, గుజ్జల తవిటయ్య, కరణం కూర్మారావు, గ్రామస్తులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే నాగావళి కుమారుడు మృతి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : టెక్కలి మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి కుమారుడు, మాజీ ఎంపిటిసి దువ్వాడ శ్రీనివాస్(50) బుధవారం రాత్రి గుండెపోటుకు గురై మృతిచెందారు. పలాస మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సమితి అధ్యక్షులు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ దువ్వాడ క్రిష్ణమూర్తినాయుడు, మాజీ ఎమ్మెల్యే నాగావళి పెద్ద కుమారుడు శ్రీనివాస్ ఎంపిటిసిగా వ్యవహరించారు. శ్రీనివాస్‌కు భార్య లక్ష్మీ, కుమారులు జయరాజ్, తరుణ్‌రాజులు ఉన్నారు. సౌమ్యుడు మృదుభాషి అయిన శ్రీనివాస్ మృతి మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి తీవ్ర దు:ఖాన్ని మిగిల్చింది.

మాజీ ఎమ్మెల్యే శివాజీ పరామర్శ : శ్రీనివాస్ మృతి సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శివాజీ దిగ్భ్రాంతికి గురయ్యారు. గురువారం లక్ష్మీపురం గ్రామానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ భౌతికాయానికి నివాళ్లు అర్పించారు. చిన్నవయస్సులో శ్రీనివాస్ మృతి చెందడం భాదాకరమని, టీడీపీ పార్టీకి తీరని లోటని అన్నారు. తల్లిదండ్రులు క్రిష్ణమూర్తినాయుడు, నాగావళిను ఓదార్చారు. ఈయన వెంట విఠల్, నాగరాజు, జగ్గారావు మష్టారు, గంగరామ్, బూర్లె రాజు, దశరథ, విజయ్‌లు ఉన్నారు. అలాగే శ్రీనివాస్ మృతి సమాచారం తెలుసుకున్న ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు దువ్వాడ జీవితేశ్వరరావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్‌లు అంత్యక్రియుల్లో పాల్గొన్నారు.

వేలంపాటకు ద్విచక్ర వాహనాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతకాలం క్రితం ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు, సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే మధుసూదన్ రావు తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలను ఈనెల 31న పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు, ఆసక్తి గల వ్యక్తులు పాల్గొనవచ్చునని ఎస్సై తెలిపారు.

మాజీ ఉప ముఖ్యమంత్రిని కలిసిన న్యాయవాదులు

విశాలాంధ్ర-పోలాకి : మాజీ ఉప ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌ను శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, ప్రస్తుతం బార్ అసోసియేషన్ అధ్యక్షపదవికి పోటీపడుతున్న డాక్టర్ ఎన్ని సూర్యారావు, బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావులు గురువారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష పదవికి పోటీపడుతున్న ఎన్ని సూర్యారావు ధర్మాన ఆశీస్సులు తీసుకున్నారు. సూర్యారావు లాంటి సౌమ్యుడు, సేవా ధృక్పథం ఉన్న వ్యక్తి అధ్యక్షుడు అయితే న్యాయవాదులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఇటీవల డాక్టరేట్ పొందిన సూర్యారావును ధర్మాన ఈ సందర్భంగా అభినందించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విశాలాంధ్ర-మందస : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగి చదువుకున్న పాఠశాలకు పేరు తేవాలని ఎన్ఐఎఫ్ఎస్ సి.ఇ.వో సునీల్ మహంతి అన్నారు. గురువారం మండలం పొత్తంగిసిరిపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో విద్యార్థులందరు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని, పరీక్షల్లో 500 మార్కులు పైగా సాధించిన ప్రతి విద్యార్థికి ప్రోత్సహ బహుమతులు అందజేస్తామని అన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేశారు. అనంతరం మహంతిని పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఒడియా డి.ఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఎంఇవో ఎం.లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.సత్యం, సి.హెచ్.విశ్వనాథం, సర్పంచ్ హేమలత సాహు, పి.ఎం.సి చైర్మన్ శివప్రసాద్ మహంతిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత సంఘాల సమావేశం

విశాలాంధ్ర-రణస్థలం : మండల కేంద్రమైన రణస్థలంలోని జెడ్పీ హై స్కూల్ ఆవరణంలో దళిత సంఘాల నేతలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దేబారికి రాము ఆధ్వర్యంలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఇందులో భాగంగా రణస్థలం మండల అధ్యక్షులుగా కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా సింకా శివకుమార్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె. సీతారాం, ఎం. అప్పన్న, డి. నర్సయ్య, రాము, రాజయ్య, పైడి రాజు, అప్పారావు, ప్రసాద్, గురువులు తదితరులు ఉన్నారు.

కనుల పండుగగా సీతారాముల విగ్రహాలు ఊరేగింపు

విశాలాంధ్ర-కవిటి: మండలం లోని పీకే పాలెం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ మందిరంలో యోగానంద గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీ సీతారాముల విగ్రహాలు పల్లకిలో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామం తో పాటు చుట్టూ ప్రక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం

సర్పంచ్ దూగాన భద్రాచలం

విశాలాంధ్ర-కవిటి: ప్రతి మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించడమే వై యస్ ఆర్ ప్రభుత్వ లక్ష్యం అని సర్పంచ్ దూగాన భద్రాచలం అన్నారు. ఈ మేరకు బుధవారం దూగానపుట్టుగ పంచాయతీ పరిధిలో లో గల మహిళా సంఘాల సభ్యులతో 3 విడత ఆసరా పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీసీ లక్ష్మి,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్తు రామారావుకు పలువురు అభినందనలు

విశాలాంధ్ర-కవిటి: శ్రీకాకుళం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నర్తు రామారావుకు కొత్త పుట్టుగ గ్రామంలోని ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం కంచిలి మండలం తాసిల్దార్, రెవెన్యూ సిబ్బంది జీవన్ కుమార్, అపర్ణ, కవిటి మండలం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, మండలంలోని సివిల్ సప్లై రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.